

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





బుధవారం, ఏప్రిల్ 8, 2026 పేజీలు:8


# కాంగ్రెస్ న్యూ టీమ్...

- 2029 గెలుపే ఏకైక అజెండా
- యువత-అనుభవజ్ఞుల సమన్వయంతో కొత్త కార్యవర్గం గ్రామ స్థాయికి పార్టీ బలోపేతం లక్ష్యం



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కొత్తగా ఎంపికైన డీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి మరియు ఎగ్జిక్యూటివ్ సభ్యులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో యువతతో పాటు అనుభవజ్ఞులైన నాయకులకు సముచిత ప్రాధాన్యం

# జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం




**నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)**
సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ఎమ్మెల్యే డాక్టర్.వంశీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు,ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్,సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి,ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే లు కసిరెడ్డి నారాయణ,కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,మునిసిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆన్ లైన్ పద్ధతిలోనే... ఇసుక రవాణా జరగాలి

- -ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణ
- -ఆన్లైన్ లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు
- -అధికారులు, సిబ్బంది ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యత వహించాలి
- -నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

## మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా



# ఆన్ లైన్ పద్ధతిలోనే... ఇసుక రవాణా జరగాలి



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
నాగర్ కర్నూల్ జిల్లాలోని ఇసుక రీచ్ ల నుండి ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా మాత్రమే మన ఇసుక మన వాహనం ఆన్ లైన్ పద్ధతిలోనే జిల్లాలో ఇసుక రవాణా జరగాలని, అందుకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల, వంగూరు మండలాల్లోని మొల్గర, పెదాపూర్, ఉల్పర గ్రామాల్లో కొనసాగుతున్న ఇసుక రీచ్ లను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకం, తరలింపు విధానాలను పరిశీలించి, అక్కడి అధికారులతో పాటు ప్రజలతో మాట్లాడి వివరాలు
తెలుసుకున్నారు. ఇసుక రవాణా పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వాహనం ఎక్కడి నుంచి ఎక్కడికి ఇసుకను తరలిస్తున్నదీ స్పష్టంగా నమోదు కావాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రాత్రి వేళలో తాను సీసీ కెమెరాల్లో రికార్డు పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఆన్లైన్ అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తవ్వకాలు లేదా రవాణా చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. అధికారులే నియమాలు ఉల్లంఘించినా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆన్లైన్ విధానం ద్వారా ఇసుక పంపిణీ జరిగితే పారదర్శకత పెరిగి, అక్రమాలు తగ్గుతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్ ల నుండి ఇసుక అక్రమ రవాణా పై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మన ఇసుక మన వాహనం ఆన్ లైన్ పద్ధతిలోనే జిల్లాలో ఇసుక రవాణా జరగాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
"మన ఇసుక -- మన వాహనం" పోర్టల్‌లో నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే ఇసుక రవాణా అనుమతులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించిన కలెక్టర్, ప్రతి దశలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని ప్రజలకు అవసరమైన ఇసుక సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఉప్పునుంతల, వంగూరు మండలాల రెవిన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) యాసంగి 2025-26 వరి ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి అంతరాయాలు లేకుండా, పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిపిఎంలు, ఏపిఎంలు, సిసిలు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, ట్యాబ్ ఆపరేటర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పంట విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 173 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాల కోసం వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాలను ఎత్తైన, అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఏప్రిల్ మూడో వారంలో ధాన్యం రాక ప్రారంభమవుతుందని, అప్పటికి అన్ని కేంద్రాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా తూకం యంత్రాలు, ఆన్లైన్ నమోదు కోసం ట్యాబ్‌లు ఉండాలని, రైతులకు తాగునీరు, టెంట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియను ఆన్లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సీనియారిటీ ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యత పేరుతో రైతులకు నష్టం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరగాలని ఆదేశించారు.
వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం నాణ్యత, తేమ శాతాన్ని ఖచ్చితంగా పరిశీలించాలని, రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరి ప్రియ, డిఆర్డిఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ డిఎం రవి నాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో 'తొలిముద్ద'

గర్భం దాల్చిన నాటిన నుంచి చిన్నారుల ఎదుగుదల వరకు పౌష్టికాహారం అందించే ఆరోగ్య కేంద్రాలుగా అంగన్‌వాడీలు పనిచేస్తున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో ప్రీ ప్రైమరీ విద్యను అందించడంతోపాటు గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వం తాజాగా చిన్నారులకు పౌష్టికాహార లోపాన్ని అధిగమించే దిశగా తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని తొలి ముద్ద బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఇప్పటికే లాంఛనంగా ప్రారంభించగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్ కోసం సన్నాహాలు చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు, బాలింతలకు ప్రతిరోజు ఉడికించిన కోడిగుడ్డు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇదే క్రమంలో చిన్నారులు ఉదయం వేళల్లో ఇళ్ల వద్ద ఏమి తినకుండానే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న వారు ఉన్నారు. వీరు మధ్యాహ్నం వరకు నీరసించిపోయే పరిస్థితి ఉండడంతో చిన్నారులకు తొలిముద్దు బ్రేక్‌ఫాస్ట్ పేరుతో పోషకాహారం అందించనున్నారు.

ఉప్మా.. కిచిడి..

అంగన్‌వాడీ వచ్చే చిన్నారులు పోషకాహార లోపాన్ని అధిగమించే దిశగా పిల్లల ఎత్తు, బరువు ద్వారా పోషణ లోపం, తీవ్ర పోషణ లోపాన్ని గుర్తించి అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు. పోషణ్ ట్రాకర్, ఎల్‌హెచ్‌ఏఎస్ యాప్‌లో వివరాలు పొందుపరుస్తూ పోషణ పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ వారికి పోషకాహారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు తొలిముద్ద బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో చిన్నారులకు ఉప్మా, కిచిడి అందిస్తారు. ప్రభుత్వమే పోషకాల మిశ్రమం కలిగిన సామగ్రి పంపించనుంది. చిన్నారుల ఎత్తు, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా విటమిన్లు, ప్రోటీన్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పేద కుటుంబాల చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.




# కాంగ్రెస్ న్యూ టీమ్...

కల్పిస్తూ కొత్త కార్యవర్గాన్ని రూపొందించినట్లు తెలిపారు. అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా సమతౌల్యంతో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన నాయకులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా, డి. శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షులుగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల పాలన ఎంతో మెరుగ్గా సాగుతోందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో ఇంకా ప్రచారం పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాల్సిన బాధ్యత నూతన కార్యవర్గ సభ్యులపై ఉందని స్పష్టం చేశారు. రానున్న 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని, ఐక్యంగా కృషి చేస్తే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా కూడా తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ వంశీచంద్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యవర్గ సభ్యులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## –కట్టుదిట్టంగా నిర్వహణకు ఆదేశాలు

**గద్వాల ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)**

:మంగళవారం జిల్లా కేంద్రంలోని విశ్వభారతి టెక్నో పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని తరగతి గదులను సందర్శించి,విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు,సెల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు.పరీక్ష సమయంలో బిట్ పేపర్లు సమయానికి అందజేయాలని,సమాధాన పత్రాలు స్వీకరించే సమయంలో జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు.విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని,వేసవి తీవ్రత దృష్ట్యా ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్,అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తంగా



విధులు నిర్వహిస్తూ ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పరీక్షా కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జటప్రోలు బ్రిడ్జి స్థితిలో వ్యవస్థకు గురి

## ప్రజలకు వాహనాలకు రాకపోకలకు భయాందోళనకు గురి



**కొల్లాపూర్ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**

పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామం చివరిలో ఉన్న బ్రిడ్జి స్థితుల వ్యవస్థకు గురి అవుతున్నది బ్రిడ్జికి సైడ్ వాళ్ళు పగిలిపోయాయి బ్రిడ్జి పైన వెళ్లేటప్పుడు ప్రజలు వాహనాలు భయాందోళనకు గురవుతున్నారు. ఇట్టి విషయాన్ని పదేపదే ఎన్నిసార్లు పత్రిక ప్రకటనలో రాసిన అధికారులు స్పందించడం లేదు, అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అయ్యో పాపం అంటారు తప్ప. చర్యలు తీసుకునే నాధుడే లేడు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము స్పందించి అందులో భాగంగా రోడ్డు భవనాల శాఖ మంత్రి స్పందించి, ఆర్ అండ్ బి రోడ్డు అధికారులను టెండర్లుకు ప్రకటించి బ్రిడ్జిని సాంక్షన్ చేసి కొత్త బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు, ప్రభుత్వాలు మారిన మంత్రులు మారినా ఎమ్మెల్యేలు మారినా సర్పంచ్లు మారినా జట్టు పోల్ బ్రిడ్జి మాత్రము మారలేదు, ఇప్పటికైనా స్పందించండి బ్రిడ్జిని నిర్మించండి.సముద్ర సెంటర్లో బ్రిడ్జి అటువైపు ఇటువైపు రెండు వైపులా సముద్రము కనబడుతుంది అందువలన దీనిని ప్రభుత్వము స్పందించి కొత్త బ్రిడ్జిని మంజూరు చేయగలరని జటప్రోలు గ్రామ వాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. రోజురోజుకు బ్రిడ్జికి నాణ్యత కడ్డీలు కంకర తేలుతూ ఉన్నాయి కాబట్టి ఈ బ్రిడ్జి ఎప్పుడు ఏ క్షణాన కూలిపోతున్న భయంధాలనుతో వారి చేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రజలు బ్రిడ్జిని దాటుతున్నారు. టెంపరేచర్ గా మైనర్ రిపేర్లు చేస్తున్నారు తప్ప బ్రిడ్జిని కొత్తగా నిర్మించాలని జటప్రోలు గ్రామ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమైనది.

# తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రాజెక్టు ముందు అడుగు....

## తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టూరిజం పర్యటక పురావత్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు....





**కొల్లాపూర్ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**

తెలంగాణ టూరిజం శాఖ ఇకపై పర్యాటకులకు భక్తులు ఆకాశ మార్గంలో సోమశిల శ్రీశైలం హెలికాప్టర్ ద్వారా దర్శించే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ నెల 9 నుంచి ప్రత్యేక హెలికాప్టర్ సేవలు సోమశిల గ్రామంలో ప్రారంభం కానుంది. అక్కడి నుండి శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దర్శనం ఆల్ ఇన్ వన్ టూర్ గా ఈ ప్యాకేజీ ప్రభుత్వ పరంగా ఉంటుంది. ఇది పర్యటనతో పాటు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాదు నుంచి సోమశిల శ్రీశైలం భ్రమరాంబిక దర్శనాలను చేసుకోవడానికి 45 నిమిషాలు హైదరాబాద్ నుండి హెలికాప్టర్లో సమయం పడుతుంది పర్యాటకులు వివరించారు,ప్యాకేజీ అంటే? ప్యాకేజీ లో హైదరాబాదు నుంచి సోమశిల కు హెలికాప్టర్లో ప్రయాణం ఉంటుంది. అక్కడ కృష్ణానది అందాలు ఈ క్షణం లలితాంబిక సోమేశ్వర ఆలయం దర్శనం తర్వాత శ్రీశైలం వెళ్లే అవకాశం ఉంటుంది, చివరగా అదే రోజు తిరిగి హైదరాబాదుకు హెలికాప్టర్లో చేరుకునే అవకాశాలు ఉన్నాయి ఈ ప్యాకేజీ ధర ఒక్కరికి రూ,1.10.000గా ప్రభుత్వ టూరిజం శాఖ నిర్ణయిస్తారు.రెండు రోజుల ప్యాకేజీ మరింత ప్రత్యేకంగా ఉంటుంది. ఇందులో సోమశిల, శ్రీశైలంలో బస, భోజన వసతి, వీఐపీ దర్శనాలు ఉంటాయి. ఒక్కొక్కరికి రూ.1,40,000గా ధర నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి హైదరాబాద్‌లో అదనపు బస సౌకర్యం కూడా కల్పించనున్నారు.

**కొల్లాపూర్ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు– జూపల్లి.**

ఈ హెలీ టూరిజం సేవలను హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ నిర్వహించనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. దీనిపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రాజెక్ట్ ముందడుగు అని పేర్కొన్నారు. కొల్లాపూర్ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ హెలికాప్టర్ టూర్‌తో సోమశిల, శ్రీశైలం ప్రాంతాలకు పర్యాటకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లో ఉన్న అందాలు సింగోటం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ అందాలు. సింగోటం కట్టపై క్యాటేజీలు జలాశయంలో యాత్రికులకు లాంచి ఏర్పాటుతో అందాలు, పెండ్లవెల్లి



మండలం మల్లేశ్వరం గ్రామంలోని పెద్దగుట్ట పైన ఐలాండ్ క్యాటేజీలు అందాలు. జటప్రోలు గ్రామంలో హరిత హోటల్ కృష్ణా నది తీరాన పుష్కర ఘాట్లు అచ్చంపేట నియోజకవర్గంలో ఉమామహేశ్వర క్షేత్రం. ఈగలపెంట పర్యాటక పరంగా నల్లమల్ల కృష్ణ నది ప్రకృతి అందాలను తినిపించడానికి వస్తున్నా యాత్రకు సోమశిల స్వాగతం పలుకుతున్నది.




# వృద్ధురాలిని రక్షించిన క్షేత్రస్థాయి అధికారి సాయి

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లాలో గురిముల్లా సత్యమ్మ (భర్త: గోపాల్ రెడ్డి) అనే వృద్ధురాలు రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్నట్లు గమనించిన స్థానిక ట్రాఫిక్ పోలీస్ ఎస్ ఐ ఆమెను సురక్షితంగా ఆర్డీఓ కార్యాలయానికి తీసుకువెళ్లారు.ఆర్డీఓ వృద్ధురాలి వివరాలు తెలుసుకొని వెంటనే క్షేత్రస్థాయి అధికారి సాయి గారికి సమాచారం అందించారు. అనంతరం ఆర్డీఓ గారి ఆదేశాల మేరకు వృద్ధురాలిని వయోవృద్ధుల ఆశ్రమంలో తాత్కాలికంగా చేర్పించడం జరిగింది.వృద్ధురాలికి కుమారుడు ఉన్నట్లు తెలిసినందున, ఆయనను పిలిపించి తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ప్రకారం తల్లిదండ్రులను చూసుకోవాలని సూచిస్తూ, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ గారు హెచ్చరించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారి సాయి మాట్లాడుతూ,‘అనాధగా లేదా సహాయం అవసరమైన వృద్ధులు ఎక్కడ కనిపించినా వెంటనే మాకు సమాచారం అందిస్తే తగిన సహాయం అందిస్తాము” అని తెలిపారు.



# సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**- వేసవిలో సాగునీటి, తగునీటికి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి**

**-వేసవిలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులను ప్రాధాన్యతా క్రమంలో సకాలంలో పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నీటిపారుదల, రెవిన్యూ, సంబంధిత అధి కారులతో సమావేశం నిర్వహించారు.జిల్లాలో నూతనంగా నిర్మించబడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో పాటు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి, కల్వకుర్తి మహాత్మా గాంధీ ఎత్తిపోతల, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని, ఈ ప్రాజెక్టులు జిల్లాలో సాగునీటి సౌకర్యాలను..మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, భూ సేకరణ, నిర్మాణ పనుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఎక్కడైనా ఆలస్యం జరుగుతున్నట్లయితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టి, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఇంకా కావాల్సిన భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని నీటిపారుదల శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.అలాగే, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో ప్రస్తుత నీటి నిల్వల పరిస్థితిపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రాబోయే మూడు నెలలపాటు జిల్లాలో సాగు మరియు త్రాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు తెలియజేశారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ముందస్తు ప్రణాళికతో నీటి వినియోగాన్ని సమర్థవం తంగానిర్వహించాలని సూచించారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లాలో ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగం, పంపింగ్ వ్యవస్థలు, సాగునీటి సరఫరా వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకుని, రైతులు మరియు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఎండాకాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముందస్తుగా పరిస్థితులను అంచనా వేసి, తగిన ప్రణాళికతో నీటి సరఫరా నిర్వహణ చేపట్టాలని సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వనరులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా కొరత తలెత్తే అవకాశం ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, బోర్ల మరమ్మతులు, కొత్త నీటి వనరుల గుర్తింపు వంటి చర్యలను వేగంగా చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించడం అధికారుల బాధ్యత అని పేర్కొంటూ, ఈ విషయంలో నిర్లక్ష్యం సహించబోదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, వేసవి కాలంలో నీటి సమస్యలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, రెవిన్యూ అధికారులు నీటి పారుదల శాఖ అధికా రులు, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.



# జిల్లాలోని రైస్ మిల్లర్లు నిర్ణిత గడువులకు ప్రభుత్వానికి బియ్యం అప్పజెప్పాలి

**జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్**




నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)

రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోపు సిఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి సమర్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. మంగళవారం వీసీ హాల్ లో అదనపు కలెక్టర్ డిఎం సిఎస్‌సి, రైస్ మిల్లర్లందరితో, డిటి సిఎస్‌సితో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2025-26 కోసం సిఎంఆర్ డెలివరీలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రబీ 2025-26 కోసం వరిని కేటాయించడానికి బ్యాంక్ గ్యారెంటీలు, ఒప్పందాలను సమర్పించాలని అలాగే మిగిలిపోయిన గోనె సంచులను వెంటనే తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం సివిల్ సప్లై సైదులు, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# టీబీ సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం రోజు డాక్టర్ రాజశేఖర్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామ ప్రజలు టీబీ సంబంధిత ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ ఆరోగ్య శిబిరం ద్వారా టీబీ స్క్రీనింగ్ మరియు చికిత్స సేవలను పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఛెస్ట్ ఎక్స్‌రే ద్వారా టీబీ స్క్రీనింగ్ నిర్వహించబడింది.అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ కేశవులు హెల్త్ అసిస్టెంట్లు జహంగీర్, రామచంద్రమ్మ,భారతీ ఏఎన్ఎంఎస్,టీబీ అలర్ట్ టీమ్ సభ్యులు ప్రవీణ్, ధర్మ ఎస్ టి ఎస్, వినోద్ డిపిసి లక్ష్మీనారాయణ, మదన్ ఎక్స్‌రే టెక్నీషియన్ వహీద్ ఎల్ టి మరియు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో మారుమోగిన భక్తి రాగాలు

**శ్రీ లక్ష్మి చెన్నకేశవ భజన మండలి సేవలు ప్రశంసనీయం.**

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**


తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపుమేరకు వీపనగండ్ల శ్రీ లక్ష్మి చెన్నకేశవ భజన మండలి వారు తిరుమలలో భక్తి పరవశంతో భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను ఆకట్టుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తి రసాన్ని మరింతగా విస్తరింపజేసింది. భజన మండలి సభ్యులు సాంప్రదాయ వాద్యాలనాదంతో భక్తి గీతాలతో స్వామివారిని సుతిస్తూ కార్యక్రమాన్ని ఎంతో ఆరాధనీయంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అన్నమయ్య కీర్తనలు గోవిందా నమస్కరణలతో ఆలయం పరిసరాలు మారుమోగాయి. ఈ సందర్భంగా భక్తులు కూడా భజనలు పాల్గొని గోవింద నామస్మరానలో లీనమయ్యారు.ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రామచంద్ర రెడ్డి మంగలి నారాయణ రవీందర్ రెడ్డి ప్రహ్లాద్ రెడ్డి వెంకట్ రెడ్డి నక్క బుడ్డయ్య నారాయణరెడ్డి హనుమంత్ రెడ్డి కానమోని రాముడు తదితరులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు వారి సేవాభావం భక్తి నియబద్ధతకు దేవస్థానం అధికారులు మరియు భక్తులు ప్రశంసలు కురిపించారు. తిరుమలలో జరిగే ఇలాంటి భజన కార్యక్రమాలు భక్తులలో అత్యధిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పలువురు




అభిప్రాయపడ్డారు. ఈ భజన కార్యక్రమం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలిగిందని భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. మొత్తానికి వీపనగండ్ల శ్రీ లక్ష్మి చెన్నకేశవ భజన మండలి నిర్వహించిన ఈ భజన కార్యక్రమం తిరుమలలో భక్తి భావాన్ని మరింతగా పెంచి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**




మండల పరిధిలోని గోవర్ధనగిరి సంగినేనిపల్లి గ్రామాలలో అక్రమంగా ఇసుక రమణ జరుగుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్సై జె నరేష్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎ లాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రోజు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు మండలంలో అక్రమ ఇసుక రవాణా పై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు

# యోగా సాధన సమతుల్య ఆహారపు అలవాట్లు సాధన చేసుకోవాలి

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయ చంద్రమోహన్**

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)**

రోజున జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ కే జయచంద్ర మోహన్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలకు మరియు ఆశా వర్కర్లకు ఆరోగ్య జీవన శైలి గురించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని రోజు యోగా సాధన చేయాలని, చెడు ఆహారపు అలవాట్లు ఉంటే దూరం చేసుకోవాలని డిఎంహెచ్ఓ సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ రఘు మాట్లాడుతూ ఆయుర్వేద మందులు ద్వారానే మనకు వచ్చే అసంక్రమిత వ్యాధులను కూడా పూర్తిగా నయం చేసే మందులు మన దగ్గర ఉన్నాయి. ఈ ఆయుర్వేద మందులు పూర్తిగా



వ్యాధులను నయం చేస్తాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సిబ్బంది ఈ యొక్క ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించుటకుగాను అరవిందు ఎంపీహెచ్ఈఓ గారు ప్రతిజ్ఞ చేయించారు ఇట్టి కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధేష్ణ డాక్టర్ లక్ష్మీకాంత్ డాక్టర్ జాప్రాజ్ డాక్టర్ నాగజ్యోతి డిపిఓ బిక్షపతి కోఆర్డినేటర్ అశోక్ కుమార్ సూపర్వైజర్ సిబ్బంది ఆఫీస్ సిబ్బంది పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సెకిళ్ల పంపిణీ

**- దివ్యాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**
**-నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి**





**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఎంపీ ల్యాండ్స్ నిధుల ద్వారా 9 మందికి 12 లక్షల 31 వేల రూపాయలతో దివ్యాంగులకు ఉపయుక్తమయ్యే ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను, ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, తన ఎంపీ నిధులను సంక్షేమానికి మరియు విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశమని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. వారి దైనందిన జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రత్యేకంగా, ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు వంటి సహాయక పరికరాలు దివ్యాంగుల స్వతంత్ర జీవనానికి ఎంతో తోడ్పడతాయని ఆయన తెలిపారు. ఇలాంటి పరికరాల పంపిణీ ద్వారా దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, వారు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగగలరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిడబ్ల్యూఓ రాజేశ్వరి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సోమశిల ప్రాంతాని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ఇచ్చిన 68 కోట్ల రూపాయలు ఎక్కడ.

**కొల్లాపూర్ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**

ఈ హెలిపాడ్ వల్ల నల్లమల్ల లో వన్య ప్రాణుల సంతతి పెర గకపోవడానికి ఆటంకం కలగదా, స్థానిక పర్యాటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సమాధానం చెప్పాలని. తెలంగాణ రాష్ట్రంలోని సోమశిల గ్రామము కేంద్రంగా అభివృద్ధి చెందడానికి కేంద్రము బిజెపి పార్టీ ప్రభుత్వము నరేంద్ర మోడీ సాస్కి పథకం ద్వారా 68 కోట్ల రూపాయలు మంజూరు చేసినారు. కేంద్ర ప్రభుత్వము బిజెపి పార్టీ ఈ నిధులు మంజూరు చేసిందా చేయలేదా చేస్తే ఈ నిధులను ఏమి చేశారో ఒక శ్వేత పత్రం విడుదల చేయాలి, బిజెపి పార్టీ సింగోటం గ్రామ పంచాయితీ డిప్యూటీ సర్పంచ్ కమటం సాయి కృష్ణ గౌడ్. సోమశిల గ్రామము పర్యాటక కేంద్రంగా అభివృద్ధి హెలిపాడ్ విషయంలో ఒక్కొక్కరికి 1,10,000 నుంచి 1.40.00 వేల రూపాయలు వసూలు చేస్తే సక్సెస్ అవుతాదా లేదా అన్న ఆలోచనలు ప్రజల్లో ఉన్నది కొల్లాపూర్ నియోజక వర్గ ప్రజలకు యువకులకు ఉపాధి ఏమన్నా ఉపయోగం ఉందా లేదా కొల్లాపూర్ ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న బడుగు వర్గాల ప్రజలకు సమాధానం చెప్పాలి, ఫారెస్ట్ అధికారులు నల్లమల్ల అడవి ప్రాంతంలోనికి మనుషులు పోవడానికి కూడా పరిమిషన్ ఇవ్వరు. ఇప్పుడు ఈ హెలిపాడ్ నల్లమల్ల అడవుల్లో తిరిగే క్రమంలో హెలిపాడ్ శబ్దానికి అడవులలో ఉండే



వన్యప్రాణులకు ఆటంకం కలగదా అనే అనుమానాలు కొల్లాపూర్ ప్రాంత ప్రజలకు ఉన్నాయి అని వివరించారు. అదేవిధంగా వన్యప్రాణుల సంతతి పెరగకపోవడానికి కారణము దీనికి సంబంధించిన ఫారెస్ట్ అధికారులు గానీ స్థానిక పర్యటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సమాధానం చెప్పాలని కొల్లాపూర్ భారతీయ జనతా పార్టీ తరుపునడిమాండ్ చేస్తున్నాము. కార్యక్రమంలో. బిజెపి పార్టీ జిల్లా నాయకులు. చంద్రశేఖర రావు. పరమేష్. రమేష్ గౌడ్. కురుమూర్తి నాయక్. తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన ఏపీఓ ధనుంజయ రాజు

**-పెద్ద మారూర్ గ్రామంలో చౌట కుంట పూడికతీత పనులు**
**-కూలీల మాస్టర్ రోల్స్‌ను పరిశీలించారు. ఏపీఓ**

చిన్నంబావి ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని పెద్ద మారూర్ గ్రామంలో గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న చౌట కుంట పూడికతీత ఉపాధి హామీ పనులను మండల ఏపీఓ ధనుంజయ రాజు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని సమీక్షించడంతో పాటు. కూలీల మాస్టర్ రోల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి రోజుకు రూ. 307 దినసరి కూలి పొందాలని సూచించారు. పని సమయంలో ఉదయం, మధ్యాహ్నం రెండు ఫోటోలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కళ్ళ ఫోటో రాని కూలీలు సమీపంలోని మీ సేవ కేంద్రానికి వెళ్లి ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని, లేకపోతే ఈ-కేవైసీ పూర్తి చేయించుకుంటేనే ఫోటోలు నమోదు అవుతాయని స్పష్టం చేశారు. మొదటి ఫోటో తీసిన తర్వాత రెండవ ఫోటో తీసేందుకు కనీసం నాలుగు గంటల విరామం ఉండాలని, అనంతరం మాత్రమే పనులు ముగించాలని ఆదేశించారు. పనులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా అన్న విషయాన్ని ఆయన పరిశీలించి ధృవీకరించారు. కూలీలకు సరైన విధంగా ఉపాధి కల్పించబడుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ మెట్లు అంజలమ్మ, సీతా మహాలక్ష్మి, శ్రీనివాసులు మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.




## నేడు నర్వ మండలంలో మంత్రి పర్యటన

**అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**
**ఆరున్నర కోట్ల వ్యాయామంతో శ్రీపురం, వాగు బిరుజికి శంకుస్థాపన**

**నర్వ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**



నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని ఆయా గ్రామాలలో జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం రోజున నర్వ మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి మరియు శంకుస్థాపనల కార్యక్రమానికి, హాజరై శంకుస్థాపనలు, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను ప్రారంభించనున్నట్లు తెలిపార గౌరవ మంత్రివర్యులు శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి గారి పర్యటన షెడ్యూలు ఈ విధంగా ఉన్నాయి 12:00 బెక్కరపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం 1:00 గం. కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం.లి2:00 గం సీపూర్ గ్రామంలో 6.4 కోట్ల రూపాయలతో నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం. నర్వ నుండి జక్కన్న పల్లి రోడ్డులో 90 లక్షల రూపాయలతో 2 కాజ్ వే బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం 3:00గం రాయికోడు గ్రామంలో నూతన 33/11 కె.వి ఉప సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం.లి3:30గం. జంగం రెడ్డి పల్లి గ్రామంలో బద్దిపల్లి వెంకట్ రెడ్డి, కర్మ కార్యక్రమం. 4:00 గం. మరికల్ మండలం బుడ్డగాని తాండ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం.లి5:00గం నర్వ ఎంపీడీవో కార్యాలయం దగ్గర కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, మరియు సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. కావున నర్వ మండలంలోని జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని గ్రామాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి సమ్ చెన్నయ్య సాగర్ తెలిపారు

## టీబీ సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన

**నర్వ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం రోజు డాక్టర్ వెంకటరమణ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు, అనంతరంవారు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు టీబీ సంబంధిత ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా టీబీ స్క్రీనింగ్ మరియు చికిత్స సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఛెస్ట్ ఎక్స్‌రే ద్వారా టీబీ స్క్రీనింగ్ నిర్వహించబడింది. అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. వెంకటరమణ , హెల్త్ ఎడ్యుకేటర్ హెల్త్ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంఎస్, టీబీ అలర్ట్ టీమ్ సభ్యులు ప్ ఎల్ టి మరియు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)**

జిల్లాలోని హోంగార్డ్స్ అధికారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ అన్నారు. అదేవిదంగా వెల్ ఫేర్ బెనిఫిట్స్ కొరకు వెల్ఫేర్ అమౌంట్ 20 నుంచి 200 రూపాయలకు పెంచుకొని ఎవరి విధులు వాళ్ళు అంకితభావంతో చేసుకోవాలని, డ్యూటీలో ఉన్నప్పుడు సక్రమంగా డ్యూటీ చేసుకోవాలనిప్రతి పరేడ్ ప్రోగ్రాంలో హోమ్ గార్డ్ అధికారులకుసలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని హోంగార్డ్స్ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నన్ను కలిసి మీ యొక్క ఇబ్బందులను చెప్పుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్.ఐ పి.రాఘవరావు, ఆర్ఎస్ఐ, ఎండీ.గౌస్ పాష, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ నారాయణ, జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జంబులు, టౌన్ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, తిరుపతి నాయక్, మల్లేష్, చిన్న కురుమయ్య, రాములు పాల్గొన్నారు.




# తిరుమలలో అన్న ఎన్టీఆర్ హయాంలో ప్రవేశ పెట్టిన అన్న ప్రసాదానికి నిన్నటికి సరిగ్గా 40 ఏళ్ళు

### తెలుగుదేశం పార్టీ జిల్లా యువ నాయకులు చందన గౌడ్

**కొల్లాపూర్ ఏప్రిల్ 7 ప్రజా జ్యోతి**

87 ఏళ్ల వయస్సులో 1817లో తుదిశ్వాస విడిచిన తరిగొండ వెంగమాంబ భక్త కవయిత్రి. తిరుపతి శ్రీవేంకటేశ్వరుని భక్తురాలుస్వామి ఏకాంతసేవలో పాల్గొనడానికిరాత్రి చివరి హారతి ఇవ్వడానికి ఆమెకు ప్రత్యేక అనుమతి ఉండేది. తిరుపతికి వచ్చిన భక్తులకోసం ఆమె అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాగర్ కర్నూలు జిల్లా యువ నాయకులు చందన్ గౌడ్ నివాసంలో ప్రజా జ్యోతి పత్రిక ఇంటర్వ్యూలో మాట్లాడారు.ఆ సాంప్రదాయాన్ని పునరుద్ధరించితిరుమలలో భక్తులకు ఉచిత అన్నదాన పథకం ప్రారంభించారు నందమూరి తారక రామారావు. ఈ పథకానికి విరాళాలు ఇవ్వమని ఆయన కోరినప్పుడు మద్రాసుకు చెందిన ఎల్.వి.రామయ్య ముందుగా స్పందించి 10 లక్షల రూపాయలు ఇచ్చారు.మాన్ సింగ్ చారిటీస్ వారు 20 లక్షలు విరాళంగా ఇచ్చారు.ఆ విధంగా 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం మూల నిధి ప్రస్తుతం రూ 2,200 కోట్లు దాటిందినాడు 2 వేల మందితో ప్రారంభమై నేడు రోజుకు లక్ష మంది భక్తులకు అన్నవితరణ చేసే స్థాయికి అభివృద్ధి చెందింది ట్రస్ట్,ఈ పథకాని 2014 లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ గా పేరు మార్చిన టీటీడీఅత్యధికంగా 9.7 లక్షల మంది దాతలు కలిగివున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్,ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ 44 లక్షలు. అన్న నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ఆయన ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తల తో కలిసి పల్లె పల్లెల్లో తెలుగుదేశం పార్టీ జెండాలకు పూర్వ వైభోగం రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీకి వస్తుందని వివరించారు.



# గోవర్ధనగిరి గ్రామంలో కరెంటు మోటర్ దొంగతనం.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో కరెంటు మోటార్ దొంగతనం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన మేకల కురుమయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన కరెంటు మోటార్ ను సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై జె నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు దొంగలను గుర్తించి పట్టుకున్నందుకు చర్యలు చేపట్టినట్లు వారు వెల్లడించారు

# మారుమూల గ్రామాలకు వైద్య సేవలు అందాలి

### –లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య

**నాగర్ కర్నూల్ : 07 ఏప్రిల్ (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ,వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎం.మధుసూదన్ రావు,చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్,డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ఆర్య పాల్గొని అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న,ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపన దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటామని,శారీరక,మానసిక ఆరోగ్య సమస్యలు మరియు నివారణ చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పిస్తారన్నారు.

అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో మారుమూల ప్రాంతాల వారికి కూడా ప్రాథమిక ఆరోగ్య సేవలు అందేలా చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. పోషకాహారం,నిత్య వ్యాయామం మరియు జంక్ ఫుడ్ కు దూరంగా ఉండటం వంటి అలవాట్ల పై దృష్టి పెట్టాలి అన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఏం. హెచ్.వో రవికుమార్ నాయక్,డాక్టర్లు,మెడికల్ కళాశాల విద్యార్థులు.వైద్య సిబ్బంది,పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా మోహమ్మద్ ఖలీల్...



**కల్వకుర్తి, ఏప్రిల్ 7( ప్రజా జ్యోతి)**

కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శిగా కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మోహమ్మద్ ఖలీల్ నియమితులయ్యారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,లు కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మోహమ్మద్ ఖలీల్ కు జిల్లా కార్యదర్శిగా నియామక పత్రం అందజేశారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా మాజీ కో ఆప్షన్ సభ్యుడు మోహమ్మద్ ఖలీల్ నియామకం పట్ల కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మోహమ్మద్ ఖలీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో తనకు జిల్లా కార్యదర్శిగా సముచిత స్థానం కల్పించడం పట్ల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి,కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.నాగర్ కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ,నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి,రాష్ట్ర,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంప్యూటర్ శిక్షణకు ప్రోత్సాహం

### యువత నైపుణ్యాభివృద్ధికి సాంకేతిక విద్య అవసరం – యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ నగరంలోని మెప్మా కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడిన ఆయన, నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అత్యవసరమని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందాలంటే సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలని, ఇటువంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. శిక్షణ కేంద్రంలో అందిస్తున్న కోర్సులు, బోధనా విధానం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రఘు దాసరి, సతీష్ కుమార్, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# గవర్నర్ ని కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్

**కల్వకుర్తి,ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి):**


తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లని రాజ్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా గవర్నర్ కు రాష్ట్రంలో ఆహార భద్రత ప్రజలకు నాణ్యమైన ఆహార సరఫరా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం అమలు వంటి కీలక అంశాలు అర్హులైన లబ్ధిదారులకు సరైన సమయంలో దాన్యం ఇతర అవసరమైన వస్తువులను అందేలా చర్యలు తీసుకుంటామని గవర్నర్ కు వివరించారు. అనంతరం గవర్నర్ రాష్ట్రంలో ఆహార భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఫుడ్ కమిషన్ సభ్యులకు సూచించారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని దిశగా అధికారులు కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి, ఉన్నారు.



# ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు

నాగర్ కర్నూల్ – ఏప్రిల్ 07 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని కేఎల్ఐ ప్రధాన కార్వలో పెద్దపూర్ గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం కాలువలో ఈతకు వెళ్లారు.వారిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రవికుమార్(16) అనే విద్యార్థి నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో పోలీసులకుసమాచారం ఇవ్వడంతో కాలువ నీటిని నిలిపివేసి రెస్క్యూటివ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.సాయంత్రం వరకు గాలించినా విద్యార్థి ఆచూకీతెలియలేదు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఘనంగా ముగిసిన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

**- 74 మంది సభ్యులతో జిల్లా కార్యవర్గ కమిటీ ఏర్పాటు**
**- పార్టీ బలోపేతానికి నేతల పిలుపు**



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):** జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా 74 మంది సభ్యులతో కొత్త జిల్లా కార్యవర్గ కమిటీని భర్తీ చేసి, వారికి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. పార్టీ అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీను ప్రధాని చేసే దిశగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఏఐసీసీ నాయకుడు సచిన్ సావంత్ కేంద్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధిపై దృష్టి సారించాలని, మత కల్లోలాలకు తెరపడాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ లక్ష్యం ఉందని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు పార్టీని పటిష్టం చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరవేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "6 గ్యారంటీలు" పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. గత పాలనలో భారత్ రాష్ట్ర సమితి కుటుంబ పాలనకే పరిమితమైందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికేయులు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి డా. అరుణ్, జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, గాలి హర్షవర్ధన్ రెడ్డి, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, జహీర్ అక్తర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు

# ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ





నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 07 ( ప్రజాజ్యోతి ) తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపానంలో భాగంగా మంగళవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో సర్పంచ్ మేకల మణెమ్మ బాలపీరు,ఉప సర్పంచ్ బాబు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో రెండు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజలు చేసినిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూమొదటి విడతలో మంజూరైన ఇండ్ల పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఇళ్ళులేని ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల బాలపీరు,కే.శ్రీనివాస్ రెడ్డి,లోకేష్‌రెడ్డి,రాజారత్నం,పర్వతాలు,నర్సయ్య,లోకేష్ రెడ్డి,గ్రామ పంచాయతీ సిబ్బంది ఎమ్.డి.సిరాజ్ మైనారిటీ నాయకులు ఎం.డి.సుల్తాన్,మైనుద్దీన్,ఎండి.పాష,తదితరులు పాల్గొన్నారు.

# వలస బాల కార్మికుల నిర్మూలనకు కఠిన చర్యలు

**- గుర్తింపు--రక్షణ--విద్యపై సమన్వయంతో ముందుకు వెళ్లాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** జిల్లాలో వలస బాల కార్మికులను గుర్తించి వారిని రక్షించి, వారికి విద్య మరియు ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, ఆరోగ్య, సంక్షేమ, విద్య శాఖలతో సమన్వయం చేసుకుని ఇటుక భట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, హోటళ్లు, గృహాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని సూచించారు. బాలల హక్కులను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఉప కార్మిక కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం "ఆపరేషన్ స్మైల్" కార్యక్రమం కింద ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ ఇటుక భట్టీలు, పౌల్ట్రీ ఫారాల్లో పనిచేస్తున్న వలస బాల కార్మికులను రక్షించి వారికి విద్య, ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

జిల్లాకు ఒడిశా, బీహార్ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు అధికంగా వస్తున్న నేపథ్యంలో వారి పిల్లలను గుర్తించి విద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటుక భట్టీల వద్ద వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. అలాగే వారి మాతృభాష తెలిసిన ఉపాధ్యాయులను నియమించి విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్జీవో ప్రతినిధి చంద్రశేఖర్ జిల్లాలో వలస కార్మికుల వివరాలు సక్రమంగా లేవని పేర్కొనగా, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో వలస కార్మికులను గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటుక భట్టీల యజమానులు తమ వద్ద పనిచేస్తున్న వలస కార్మికుల వివరాలను తప్పనిసరిగా కార్మిక శాఖలో నమోదు చేయించుకోవాలని, వారికి నివాసం, తాగునీరు, రేషన్, ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధర్మాపూర్, యెనుగొండ ప్రాంతాల్లో యజమానులు తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ త్వరలో ఆ ప్రాంతాలను సందర్శిస్తానని తెలిపారు.

వలస కార్మికులకు రేషన్ సౌకర్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వ "ఒక దేశం--ఒక రేషన్ కార్డు" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియా, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ఉప కార్మిక కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, డిఆర్‌డిఓ నరసింహులు, డిడబ్ల్యుఓ జరీనా బేగం, జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ శాఖల అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు, ఇటుక భట్టీల యజమానులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎల్బిలను జాగ్రత్తగా తయారు చేయాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ఏప్రిల్ 7**

జన గణన 2027 ప్రక్రియలో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్(హెచ్ ఎల్ బీ) లను గుర్తించడం అత్యంత కీలకమని, కాబట్టి హెచ్‌ఎల్బిలను జాగ్రత్తగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సంబంధిత చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి జనగణన ప్రక్రియపై పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జన గణన 2027 ప్రక్రియలో భాగంగా మే 11వ తేదీ నుంచి హౌస్ హోల్డ్ ఎన్యుమరేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. కాబట్టి, ఇందులో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్(హెచ్ ఎల్ బీ)లను గుర్తించడం అత్యంత కీలకమని, కాబట్టి హెచ్ ఎల్ బి లను జాగ్రత్తగా తయారు చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎల్బీ లను రూపొందించే క్రమంలో ఒక్క ఏరియా కూడా మిస్ కాకూడదని సూచించారు. అన్ని ఏరియాలు కవర్ అయ్యాల లేదా అని క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా, సెన్సెస్ ప్రక్రియలో పాల్గొనబోయే ఎన్యుమరేటర్లకి ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మూడు రోజులపాటు కొనసాగబోయే ఈ శిక్షణకు ఎన్యుమరేటర్లు అందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీలోగా ఎన్యుమరేటర్లు అందరికీ శిక్షణకు వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వీరి శిక్షణ కోసం సంబంధిత ఛార్జ్ అధికారులు అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీలకి పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కూలీలకి తప్పనిసరిగా త్రాగడానికి నీరు, నిలువ నీడ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి లేబర్ పని దినాలతో పాటు, ఇతర లక్ష్యాలను కూడా సకాలంలో సాధించాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.

# ఏవీఆర్ గ్లోబల్ స్కూల్ మూడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**గండీడ్ ఏప్రిల్ 7(ప్రజా జ్యోతి)**

గండీడ్ ఏవీఆర్ గ్లోబల్ స్కూల్ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు నృత్యాలు, నాట్యాలు, డాన్స్ ప్రోగ్రాములు, నాటకాలతో తమ ప్రతిభను ప్రదర్శించి కనుల పండుగగా మార్చారు. ఈ వేడుకలకు హాజరైన తల్లిదండ్రులు చిన్నారుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు చూపిన ప్రతిభపై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ, పిల్లలకు మంచి విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ కలిగిన భవిష్యత్తును అందిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

